సాక్షి జనగామ

శుక్రవారం | 12 | జూలై | 2024



ఉద్యోగ భద్రత కల్పించాలి

గ్రామీణ ప్రాంత ధూపదీప నైవేద్య అర్చకుల కు ఉద్యోగ భద్రత కల్పించాలని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఉపేంద్ర శర్మ కోరారు.

- 8లో▸



సమయపాలన పాటించాలి

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని పలు విభాగాలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయ పాలన పాటించాలని రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33 /25°

జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

కేసీఆర్‌ను కలిసిన 'పల్లా'



జనగామ: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా కేసీఆర్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి స్వీటు తినిపించారు. ఇలాంటి పుట్టిన రోజులు మరిన్ని జరుపుకోవాలని ఆశీర్వదించారు.

వాటర్ ప్లాంట్లకు నోటీసులు

జనగామ: పట్టణంలో నిబంధనలు పాటించ కుండా నడిపిస్తున్న వాటర్ ప్లాంట్లను గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐఎస్‌ఐ సర్టిఫికెట్‌తో పాటు ఇతర నిబంధనలు పాటించని పది ప్లాంట్లకు నోటీసులు జారీ చేసి, 3 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే దోమల నివారణకు పట్టణ ప్రధాన రహదారులపై ఫాగింగ్ చేశారు.

ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్..

జనగామ: ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సమయంలో స్పౌజ్ పాయింట్లతో నిబంధనలు ఉల్లంఘించారనే ప్రాథమిక విచారణ నివేదిక మేరకు విద్యాశాఖ అధికారులు ఏడుగురు ఉపాధ్యాయులకు గురువారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ రాము వెల్లడించారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని, సంజాయిషీ ఇవ్వకున్నా.. ఇచ్చిన సమాధానం సంతృప్తిగా లేకున్నా చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. పలు ఉపాధ్యాయ సంఘాలు సైతం స్పౌజ్ పాయింట్లతో ఎవరెవరు బదిలీ అయ్యారనే సమగ్ర సమాచారం బహిర్గతం చేయాలంటూ వాట్సాప్ గ్రూప్‌ల్లో చర్చ సాగిస్తున్నారు.

పద్మశ్రీ సమ్మయ్యకు సన్మానం



దేవరుప్పుల: పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్యను కేంద్ర బొగ్గుల గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లంకల దీపక్‌రెడ్డి, గౌతమ్‌రావు, మహేందర్, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ కల్పించాలి

లింగాలఘణపురం: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బాగాంధీ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం మండల పరిధి పాఠశాలలను సందర్శించిన అనంతరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. స్కావెంజర్ల నియామకాలు చేపట్టాలని, పాఠశాలలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఐదో విడత కరువు భత్యం, పీఆర్‌సీ నివేదిక అమలు చేయాలని, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి కృష్ణ, మండల అధ్యక్షుడు భాస్కర్, నర్సింహులు, నవీన్ పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలి

జనగామ రూరల్: రైతులు పండించిన పత్తిని జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేయాలి.. ఈ సీజన్ నుంచే ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం చందునాయక్ మాట్లాడుతూ.. పత్తి రైతుల ఆత్మహత్యలను నివారించడానికి జనగామ మార్కెట్లో పత్తి కొనుగోలుకు 2006 సంవత్సరంలో రూ.3.18 కోట్లతో ప్రత్యేక పత్తి యార్డు నిర్మించారని, 12 ఏళ్లుగా కొనుగోళ్లు జరగడంలేదన్నారు. సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ప్రైవేట్‌లో తక్కువ ధరకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. క్వింటాకు రూ.12 వేలు ధర నిర్ణయించి సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీరయ్య, సహాయ కార్యదర్శి రామావత్ మీట్యానాయక్, కర్రె సత్తయ్య, కర్రె బీరయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

కత్తిదూసిన ప్రేమోన్మాదం

జంట హత్యలతో ఉలిక్కిపడిన పదహారు చింతల్‌తండా

- ప్రేయసిని దూరం చేశారని తల్లిదండ్రులను చంపిన ప్రియుడు
- ప్రేమించి పెళ్లి చేసుకున్నాక విడిపోయిన జంట
- వేరే సంబంధం చూస్తున్నారని కోపం పెంచుకున్న నిందితుడు
- తండాలో ముందస్తు రెక్కీ.. సమాచారం సేకరణ
- అర్ధరాత్రి కత్తితో విచక్షణా రహితంగా నరికిన వైనం



సుగుణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నారావుపేట: ప్రేమోన్మాదం పెట్రేగిపోయింది. విచక్షణ మరిచి అతి ఆవేశంలో కత్తిదూసింది. 'నా బిడ్డను వదిలిపెట్టు. నీతో ఉండనంటుంది. నీకు, మాకు కుదరదు' అన్న ఆ తల్లిదండ్రులపై ప్రియుడు పెంచుకున్న కక్ష హంతకుడిగా మార్చింది. ఫలితంగా రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. భార్య(ప్రేయసి)తోపాటు ఆమె సోదరుడిని ఒంటరివారిని చేసింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారు చింతల్‌తండాలో బుధవారం అర్ధరాత్రి జరిగిన జంట హత్యలు ఉమ్మడి జిల్లాలో సంచలనం సృష్టించాయి. తండాకు చెందిన బానోత్ శ్రీనివాస్(40), సుగుణ(35)లది నిరుపేద కుటుంబం.. వీరికి ఇరువురు సంతానం దీపిక, మదన్‌లాల్. వీరు నిత్యం వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమై ఉంటారు. ఈక్రమంలో కుమార్తెకు వివాహం చేసి గౌరవంగా సాగనంపాలనుకున్న వారి ఆశలపై ప్రేమోన్మాది వేట సాగించి ఆ కుటుంబాన్ని కోలుకోకుండా చేశాడు. దంపతులు శ్రీనివాస్, సుగుణను ప్రేమోన్మాది హత్య చేసిన ఘటనతో తండా ఉలిక్కిపడింది. హత్య జరిగిన ఘటనా స్థలానికి గురువారం తెల్లవారు జామునే పోలీసులు చేరుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తండావాసులు సీఐ చంద్రమోహన్, ఎస్సై గూడ అరుణ్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ముందస్తు రెక్కీ....

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజు(బన్నీ)తో దీపిక ప్రేమలో పడింది. ఇద్దరివి వేర్వేరు సామాజిక వర్గాలు. ఇంట్లో చెప్పకుండా వెళ్లి ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. 2023 నవంబర్‌లో ఇద్దరి మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో దీపిక తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటోంది. తల్లిదండ్రులు గత జనవరిలో చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా, పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుంటామని పోలీసులకు తెలిపి బయటకు వచ్చారు. పెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకుని ఒకరికొకరు కలవకుండా దూరంగా ఉండడమే కాకుండా విడాకుల ఒప్పంద పత్రాలను సైతం రాసుకున్నట్లు తెలిసింది. యువతి తల్లిదండ్రులతో ఉంటుండగా, నాగరాజు హైదరాబాద్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయాడు. నెల రోజుల క్రితం గుండెంగలో అమ్మమ్మ ఇంటికి చేరుకుని ఆటోను అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. సదరు యువతికి వివాహ సంబంధాలు చూస్తున్నారనే విషయం తెలుసుకున్న నాగరాజు కోపం పెంచుకున్నట్లు వారి కుటుంబంపై పగ తీర్చుకోవాలనే ఉద్దేశంతో తండాపై రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. పలుమార్లు తండాకు వచ్చి కుటుంబ వివరాలు సైతం సేకరించినట్లు సమాచారం.

ఇంటికి వచ్చాక ఫోన్ చేసి బెదిరించాడు

- దీపిక, శ్రీనివాస్ కుమార్తె

పింగిళి కాలేజీలో డిగ్రీ చదువుతున్న క్రమంలో నెక్కొండలో నాపై మరుగు మందు చల్లి హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. ఆ తర్వాత నర్సంపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా అక్కడి నుంచి సుబేదారి స్టేషన్‌కు పంపగా అక్కడినుంచి నాగరాజుతో వెళ్లిపోయా. సీపీ వద్ద మా తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా చెన్నారావుపేట పోలీసుల వద్దకు వచ్చింది. చెన్నారావుపేట పోలీసులు పిలవడంతో హైదరాబాద్ నుంచి వచ్చి తల్లిదండ్రులతో ఉంటున్నాను. ఆస్తి కోసం నన్ను ట్రాప్ చేశాడు. ఇటీవల మా బ్రదర్‌కు ఫోన్ చేసి నేను మీ బావను మాట్లాడుతున్నానని, మీ అక్క ఎక్కడ ఉందని అడిగితే తిట్టి ఫోన్ కట్ చేశాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి పడుకున్నాక కత్తితో దాడిచేసి మా తల్లిదండ్రులను చంపాడు.

భార్యను చంపేందుకే వచ్చాడు..

'నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకున్నాం. అతడిపై 333, 103, 109ఆర్/డబ్ల్యూ 49 ఆఫ్ బీఎన్‌ఎస్ అండ్ 25(ఏ) ఆఫ్ ఆర్మ్స్' యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. భార్యను చంపేందుకే వచ్చాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు అడ్డుగా రావడంతో వారిని చంపినట్లు విచారణలో వెల్లడైంది' అని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ గురువారం రాత్రి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల క్రితమే భార్యాభర్తలు నాగరాజు, దీపిక మధ్య గొడవలు మొదలయ్యాయని, దూరం పెట్టడం సహించలేని అతడు చంపేందుకు నెల రోజుల క్రితమే కత్తిని కొనుగోలు చేసినట్లు వెల్లడైందని తెలిపారు.

శిక్షలు పడుతున్నా ఆగని దాడులు

- ప్రేమపేరుతో వేధింపులు.. అడ్డుగా ఉంటున్నారని తల్లిదండ్రులపైనా కక్ష
- విచక్షణ మరిచి హత్యలు

నాగరాజును కఠినంగా శిక్షించాలి

- నర్సంపేటలో మృతుల బంధువులు, గ్రామస్తుల ధర్నా

- 8లో▸

ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలి



బాధితులను పరామర్శిస్తున్న సుదర్శన్‌రెడ్డి

హన్మకొండ: ప్రేమోన్మాది దాడిలో తల్లిదండ్రులను కోల్పోవడంతోపాటు గాయాలపాలై హనుమకొండ బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దీపిక, మదన్‌లాల్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి డాక్టర్‌తో మాట్లాడారు. వైద్య ఖర్చులు తామే భరిస్తామని, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో రెండు హత్యలు జరిగినా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించకపోవడం దారుణమన్నారు. మృతుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గుండెంగలో పోలీసుల బందోబస్తు

గూడూరు: మండలంలోని గుండెంగ గ్రామానికి చెందిన నాగరాజు రెండు హత్యలు చేసిన విషయం తెలుసుకున్న పోలీసులు గుండెంగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 100 మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఎవరూ వీధుల్లో తిరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

మదన్‌లాల్‌కు ఆపరేషన్

నాగరాజు కత్తి దాడిలో దీపిక సోదరుడు మదన్‌లాల్ కుడి వైపు దవడకింది భాగంలో లోతైన గాయమైంది. దంతాల వరకు ఆ గాయం ఏర్పడింది. అతనికి గురువారం అర్ధరాత్రి ఆపరేషన్ చేసి కుట్లు వేశారు.

స్వగ్రామంలో అంత్యక్రియలు

నర్సంపేటలో పోస్టుమార్టం అనంతరం శ్రీనివాస్, సుగుణ మృతదేహాలను పోలీసులు స్వగ్రామంలోని సొంత వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లారు. బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. కుమారుడు మదన్‌లాల్‌కు ఆపరేషన్ చేస్తుండడంతో కూతురు దీపికతో అంతిమ సంస్కారాలు చేయించారు.

ఆదర్శం.. చాకలి ఐలమ్మ జీవితం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శ్రీహరితోపాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో కడియం మాట్లాడుతూ.. పాలకుర్తి కేంద్రంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూస్వాములు, దొరలను ఎదిరించి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ.. ఆమె పోరాటం దేశానికే స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. మండలాల్లో చాకలి ఐలమ్మ విగ్రహాలతో పాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ చేశారు. అంతకుముందు బ్రహ్మంగారి గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఐలమ్మ మునిమనువరాలు సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు సీహెచ్.నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, జె.శిరీష్ రెడ్డి, గన్ను నర్సింహులు, రజక సంఘం అధ్యక్షుడు ఉపేందర్, పొన్న శ్రీనివాస్, పొన్న రవి, వెంకటేశ్వర్లు, మదార్, రమేష్, బిక్షపతి, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.500 కోట్లతో ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి అందించాను.. రెండు నెలల్లో పరిపాలన పరమైన అనుమతులు వస్తాయి.. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే కాంగ్రెస్ పార్టీలో చేరానని గుర్తు చేశారు. ముఖ్యంగా వంద పడకల ఆస్పత్రికి నిధుల మంజూరు, ఆర్టీసీ స్థలం కేటాయింపు విషయాన్ని ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నిరుద్యోగ యువతను రెచ్చగొడుతూ బీజేపీ నేతలు చవకబారు ఆరోపణలు చేస్తున్నారని, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణకు వారు ఒరగబెట్టిందేమి లేదని ఎద్దేవా చేశారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలి.. ఇందుకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జనగామ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుమూల ప్రాంతాలు, గిరిజన తండాల్లో ఆశ కార్యకర్తలు కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ సెంటర్‌కు వచ్చే ప్రతీ గర్భిణికి న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కల్పిస్తూనే మొదటి కాన్పు.. రెండో కాన్పు మధ్య ఉండాల్సిన గ్యాప్‌పై వివరించాలని చెప్పారు. కుటుంబ నియంత్రణకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకోవడానికి స్త్రీలు మాత్రమే కాకుండా పురుషులు కూడా ముందుకు రావాలని సూచించారు. కుటుంబ నియంత్రణపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేసిన వైద్య సిబ్బందిని అభినందించారు. జిల్లా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు, సర్జన్ శ్రీదేవి, వైద్యాధికారులు డాక్టర్ రవిరాథోడ్, విష్ణు, సామాజిక ఆదర్శ అధికారి ఎం.ఎం.రహెమాన్, నీలిమ, సురేశ్, వెంకన్న తదితరులకు బహుమతి, మెమెంటో ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్, కుటుంబ నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, అధికారులు డాక్టర్ మహేందర్, రవిందర్‌గౌడ్, కరుణాకర్‌రాజు, సుధీర్, అశోక్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

వైద్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని నెహ్రూపార్క్ నుంచి రైల్వేస్టేషన్ వరకు వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీని డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ ప్రారంభించారు.

ఉచిత అడ్మిషన్‌కు విద్యార్థుల ఎంపిక

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గవర్నమెంట్ ఉమెన్స్ టెక్నికల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్‌లో మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో 2024–25 విద్యాసంవత్సరం అడ్మిషన్‌కు జిల్లా నుంచి ముగ్గురు అనాథ విద్యార్థినులను ఎంపిక చేశారు. వారికి కలెక్టర్ రిజ్వాన్ బాషా గురువారం అనుమతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా తల్లిదండ్రులు కోల్పోయిన(అనాథ) బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు(పాక్షిక అనాథ) అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోగా మొదటి కౌన్సెలింగ్‌లో ముగ్గురిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జీసీడీఓ గౌసియా బేగం, డీసీపీఓ రవికాంత్ పాల్గొన్నారు.

పట్టుదలతో అడుగులు వేయాలి

నర్మెట: విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని పట్టుదలతో అడుగులువేసి విజయం సాధించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి 9.3 జీపీఏ సాధించిన విద్యార్థిని చింతల కళ్యాణి(అనాథ బాలిక) దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం పొందడంతో అభినందించారు.

కేసీఆర్ ఫాంహౌస్ నుంచి జైలుకే..

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: ఉద్యమ పార్టీ ముసుగుతో అధికారంలోకి వచ్చి.. వేలకోట్లు సంపాదించి ప్రజల తిరస్కారానికి గురై ఫాం హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ త్వరలోనే జైలుకు వెళ్లబోతున్నాడని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్న హరీశ్‌రావు, కేటీఆర్ ఇప్పుడు చిలుక పలుకులు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ఇన్ని రోజులు నియంత పాలనలో విసిగిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు.. రేవంత్‌రెడ్డి ప్రజాపాలనపై నమ్మకంతో కాంగ్రెస్‌లోకి స్వచ్ఛందంగా వస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యమకారుల వద్ద కేసీఆర్ పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఆరోపించిన కొమ్మూరి.. కేటీఆర్, హరీశ్‌రావు తెలంగాణ అభివృద్ధి కోసం ఢిల్లీకి వెళ్లలేదని, లిక్కర్ స్కాంలో ఇరుక్కుపోయి జైలు జీవితం గడుపుతున్న కవితకు బెయిల్ కోసమే వెళ్లారని చెప్పారు. 2001 తర్వాత నుంచి కేసీఆర్ ఆస్తులను లెక్కించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు 15లోగా రాష్ట్రంలో రుణమాఫీ చేయబోతున్నామని, ఎన్నికల సమయంలో చేసిన శపథం ప్రకారం హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండవాలన్నారు. జనగామ ఎమ్మెల్యే దొంగఓట్లతో గెలిచినట్లు నిరూపిస్తానని, బీఆర్‌ఎస్ నాయకులకు దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. యశ్వంతాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి తీసుకున్న స్థలంలో అర ఎకరం ఆక్రమించారని, భవన నిర్మాణానికి జీపీ అనుమతులు లేవని, దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరుతామన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణి మల్లారెడ్డి, చెంచారపురెడ్డి, ఎన్.మహేందర్‌రెడ్డి, లింగాల నర్సిరెడ్డి, ఎస్.నరసింగరావు, వెన్నం సత్య నిరంజన్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎండీ.జాఫర్ షరీఫ్, జి.నర్సింహారెడ్డి, శివరాజ్ యాదవ్, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి నోటీసులు

జనగామ: యశ్వంతాపూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయ నిర్మాణ సమయంలో 20 గుంటల స్థలం కబ్జా చేశారని రెవెన్యూ అధికారులు ఆ పార్టీకి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేపట్టి కబ్జాకు గురైనట్లు తేల్చి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించగా.. పక్కనే ఉన్న మరో అర ఎకరం స్థలాన్ని ఆక్రమించారని నోటీసులో తెలిపారు. 2019లో 82 సర్వే నంబర్‌లో గజానికి రూ.100 చొప్పున బీఆర్‌ఎస్ ప్రభుత్వం పార్టీ కార్యాలయానికి రూ.4.84 లక్షలకు ఎకరం స్థలం కేటాయించింది. దాని పక్కనే ఉన్న 20 గుంటల భూమిని సైతం కలిపేసుకుని ప్రహరీ నిర్మించుకున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ నెల 9న తహసీల్దార్ వెంకన్న ఆదేశాల మేరకు అధికారులు నోటీసులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అందించారు. పార్టీ కార్యాలయ పరిధిలో కబ్జాలో ఉన్న అర ఎకరం భూమికి సంబంధించి 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

27 మంది ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 27 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ.. సీపీ అంబర్ కిషోర్‌ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.శ్రీనివాస్ హనుమకొండ నుంచి ఐనవోలు, టి.ప్రశాంత్‌బాబు పీసీఆర్ నుంచి నల్లబెల్లి, బి.రామారావు నల్లబెల్లి నుంచి సుబేదారి, ఎన్.వెంకటేశ్వర్లు వంగర నుంచి దుగ్గొండి, జె.పరమేశ్వర్ దుగ్గొండి నుంచి వీఆర్ వరంగల్, ఎన్.నగేశ్ వీఆర్ నుంచి నర్మెట్ట, కె.శ్రీకాంత్ నర్మెట్ట నుంచి సుబేదారి, కె.కుమార్ మట్టెవాడ నుంచి గీసుకొండ, ఎ.శ్రీకాంత్ మిల్స్‌కాలనీ నుంచి పరకాల, బి.ప్రవీణ్ నర్మెట నుంచి ఆత్మకూరు, బి.రాంచంద్రం వీఆర్ వరంగల్ నుంచి కేయూసీ, ఎ.సురేశ్ కేయూసీ నుంచి వీఆర్ వరంగల్, ఎస్.రాజన్‌బాబు సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి వరంగల్ ట్రాఫిక్, డి.సాంబయ్య సుబేదారి నుంచి సీసీఎస్ వరంగల్, ఎం.సురేశ్ హసన్‌పర్తి నుంచి మిల్స్‌కాలనీ, ఎం.రాజు హసన్‌పర్తి నుంచి సీసీఎస్ వరంగల్, టి.కృష్ణమూర్తి పీసీఆర్ నుంచి సీఎస్‌బీ, ఎస్‌కే హమీద్ వీఆర్ వరంగల్ నుంచి నర్మెట, డి.దేవేందర్ కేయూసీ నుంచి హసన్‌పర్తి, బి.రాజేశ్‌కుమార్ వీఆర్ వరంగల్ నుంచి జనగామ, ఎం.సిద్ధయ్య వీఆర్ వరంగల్ నుంచి హసన్‌పర్తి, డి.నిషారెడ్డి వీఆర్ వరంగల్ నుంచి సీసీఎస్, బండారి రాజు ధర్మసాగర్ నుంచి సీఎస్‌బీ, టి.యాదగిరి వరంగల్ సీసీఎస్ నుంచి వరంగల్ ట్రాఫిక్, ఎండీ.నజీర్ ఎస్సై పదోన్నతి సీఎస్‌బీ, కె.సారంగపాణి పదోన్నతి నుంచి సీఎస్‌బీ, జి.రమేశ్ పదోన్నతి నుంచి సీఎస్‌బీకి బదిలీ అయ్యారు.

క్లుప్తంగా

సమయపాలన పాటించాలి

● కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విభాగాలు, కాలేజీల్లో ఉద్యోగులు సమయపాలన పాటించాలని రిజిస్ట్రార్ పి మల్లారెడ్డి అన్నారు. గురువారం క్యాంపస్‌లోని కమిటీ హాల్‌లో నిర్వహించిన అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సూపరింటెండెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు కచ్చితంగా పనివేళలు, సమయపాలన పాటించాల్సిందేనన్నారు. ఉద్యోగుల హాజరు విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే, అవసరమైన వారికి ప్రాథమిక స్థాయి శిక్షణ ఇవ్వడానికి యూనివర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. నూతన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు యూనివర్సిటీ నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. అడ్మినిస్ట్రేషన్, ప్రొసీజర్లు, అకౌంట్స్, ఆడిట్, కంప్యూటర్, ఆంగ్లభాషపై శిక్షణ ఇస్తామని వెల్లడించారు. కాగా, సూపరింటెండెంట్లుగా పదోన్నతి పొందిన కృష్ణమూర్తి, ప్రతాప్, సదాశివుడిని అభినందించారు.

పెళ్లి సంబంధాలు రావడం లేదని..

● యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

రఘునాథపల్లి: పెళ్లి సంబంధాలు రావడం లేదని జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వంగ సిద్దినర్సయ్య రెండో కుమారుడు శ్రీకాంత్ (27) గ్రామంలో కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు.ఈ క్రమంలో పెళ్లి సంబంధాలు రాకపోవడంతో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. కుటుంబీకులు పెళ్లి సంబంధాల కోసం జాడ తీసినా కుదరడం లేదు. దీంతో ఇక తనకు పెళ్లి కాదేమోనని జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సిద్దినర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

శిక్షలు పడుతున్నా ఆగని దాడులు

ప్రేమపేరుతో వేధింపులు.. అడ్డుగా ఉంటున్నారని తల్లిదండ్రులపైనా కక్ష

● విచక్షణ మరిచి హతమార్చడానికీ వెనుకాడని ప్రేమోన్మాదులు
● కొత్త చట్టాలతోనైన న్యాయం జరిగేనా...?



వరంగల్ క్రైం: ప్రేమపేరుతో వెంటపడడం.. పెళ్లి చేసుకుంటానని మోసగించడం.. మోసం బయటపడుతుందని, ప్రేమకు అడ్డుపడుతున్నారని కుటుంబ సభ్యులను హతమార్చడం ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తెలిసీతెలియని వయసులో సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకుంటున్నారు.. వాటిని ప్రేమగా భావించి యువతీయువకులు నిండుజీవితాలకు సగంలోనే ముగింపు పలుకుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చెన్నారావుపేట మండలం పదహారు చింతల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ప్రేమోన్మాది చేతిలో యువతి తల్లిదండ్రులు బానోత్ శ్రీనివాస్, సుగుణ హత్యకు గురికాగా, దీపిక, మదన్‌లాల్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. నిందితుడు మేకల నాగరాజు వేట కత్తితో ఉచకోత కోసిన ఈ ఘటనతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ తరహా ఘటనలు గతంలో జరిగి నిందితులకు జీవిత ఖైదు పడినప్పటికీ పునరావృతం కావడం ఆందోళన కలిగిస్తోంది.

కమిషనరేట్ పరిధిలో వరుస సంఘటనలు..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా జరుగుతున్న దాడులతో తమ బిడ్డలను కళాశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కాలంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన కొన్ని సంఘటనలు.

- 2017 నవంబర్ 29న ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన వివాహిత బోయిన మాధురి (25)ని కందుల చంద్రశేఖర్ ఊరిబయటకు తీసుకెళ్లి కత్తితో దాడి చేసి, యాసిడ్ పోసి చంపేశాడు. చంద్రశేఖర్‌తోపాటు అతడికి సహకరించిన వారు జైలు పాలయ్యారు.
- 2019 ఫిబ్రవరి 27న డిగ్రీ విద్యార్థిని తోపుచర్ల రవళి(20)పై పెండ్యాల సాయి అన్వేశ్ పెట్రోల్ పోసి నిప్పుపెట్టాడు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. బాధితురాలు నెల రోజులపాటు నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. నిందితుడు సాయి అన్వేశ్‌కు జీవిత ఖైదు పడింది.
- 2019 నవంబర్ 29న గంధం మానస (18)ను పులిసాయికుమార్ తన కారులో చిన్నపెండ్యాల వైపు తీసుకెళ్లి లైంగిక దాడిచేసి హత్య చేశాడు. ఈ సంఘటనలో నిందితుడికి జీవిత ఖైదు పడింది.
- హనుమకొండ లష్కర్‌సింగారానికి చెందిన మునిగాల హరిత(20)పై కాజీపేట విష్ణుపురి కాలనీకి చెందిన మహ్మద్‌సాజిద్ లైంగికదాడికి పాల్పడి హత్యచేశాడు. వేరొకరితో పెళ్లికి సిద్ధమైందని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో 2020 జనవరి 10న నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడి పోలీసులకు లొంగిపోయాడు.
- సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని 2022 ఏప్రిల్ 28న గోవిందరావుపేటకు చెందిన జనగాం శ్యాం తాను ప్రేమించిన యువతిని ఓ హోటల్‌లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. దాడి చేసి పెట్రోల్ పోసి అంటించగా బాధితురాలు కేకలు వేయడంతో హోటల్ సిబ్బంది కాపాడారు.

కొత్త చట్టాలతో న్యాయం జరిగేనా?

నమ్మితే నయవంచనకు పాల్పడుతున్న ప్రేమోన్మాదులకు కొత్త చట్టాలతోనైన శిక్షలు పడేనా? అని బాధిత తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రేమ అనే రెండు అక్షరాలకు విలువనిచ్చి నిండు నూరేళ్ల జీవితాన్ని చీకటి మయం చేసుకుంటున్న వారు ఎంతోమంది ఉన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలతో పాటు మంచిచెడులు నేర్పించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రేమ పేరుతో సమాజంలో చీడ పురుగులవుతున్న పేమోన్మాదులకు ఉరిశిక్ష విధిస్తేనే మరొకరు ఇలాంటి చర్యలు పాల్పడరని, ప్రభుత్వం నూతన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని పలువురు బాధితులు కోరుకుంటున్నారు.

నాగరాజును కఠినంగా శిక్షించాలి





ధర్నా చేస్తున్న మృతుల బంధువులు, గ్రామస్తులు, ధర్నా విరమించాలని కోరుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

● మృతుల బంధువులు, గ్రామస్తుల డిమాండ్
● నర్సంపేటలో ధర్నా

నర్సంపేట రూరల్ : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల్‌తండాకు చెందిన బానోత్ శ్రీనివాస్ (40), సుగుణ (35) దంపతులను హత్య చేయడంతోపాటు వారి పిల్లలను తీవ్రంగా గాయపరిచిన ప్రేమోన్మాది గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మేకల నాగరాజును కఠినంగా శిక్షించాలని మృతుల బంధువుల, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతుల కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు నర్సంపేటలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. నిందితుడిని బహిరంగంగా ఉరితీసి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కాగా, న్యాయం చేయాలని ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకుని పక్కకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. నాగరాజుపై చర్యలు తీసుకుని బాధిత కు టుంబాన్ని న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కాగా, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, నర్సంపేట టౌన్, రూరల్, నెక్కొండ సీఐలు, ఎస్సై ఘటనా స్థలికి చేరుకుని మృతుల బంధువులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాకు ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి..

మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నర్సంపేటలో మృతుల కుటుంబీకులు, గ్రామస్తులు చేపట్టిన ధర్నా, రాస్తారోకో వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపి మాట్లాడారు. మృతుల కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి వారి పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి మరోసారి అతడి నుంచి ఆ కుటుంబానికి ఎలాంటి హాని కలగకుండా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ

● 'కుడా' అధికారుల ఫిర్యాదుతో కదలిక
● ధరణి పాస్‌బుక్ స్వాధీనం.. రద్దుకు సిఫారసు

ఖిలా వరంగల్: మధ్యకోట ఏకశిల చిల్డ్రన్స్ పార్క్ విస్తీర్ణంలో భాగంగా 2018లో గుండు చెరువు, పార్క్ సమీపంలోని 64, 65, 66, 83, 84, 85, 86, 87, 88, 89, 90, 91, 92 సర్వే నంబర్లలో గల 29.29 ఎకరాల వ్యవసాయ భూమిని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించి పలు రకాల మొక్కలు నాటి పెంచుతోంది. 29.29 ఎకరాల భూమిలో 85 సర్వే నంబర్‌లోని 2.3 ఎకరాలు మినహాయిస్తే మిగతా సర్వే నంబర్లు ధరణి వెబ్‌సైట్‌లో ప్రభుత్వ పేరు మీద నమోదయ్యాయి. 'కుడా' అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపులేని కారణంగా కొన్న భూమిని పూర్తి స్థాయిలో ధరణిలో నమోదు చేయించలేదనే ఆరోపణలున్నాయి. 85 సర్వే నంబర్‌లోని 2.3 ఎకరాల భూమి రైతు పేరుతో ఉండడం .. ఆ రైతు పాస్‌బుక్ పొంది ఉండడం.. కొద్ది నెలల క్రితం రైతు మృతి చెందగా.. సదరు భూమిని రైతు భార్య పేరు మీదికి బదలాయించినట్లు తెలుసుకున్నారు.

రైతు నుంచి భూమి పత్రాలు స్వాధీనం

మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్ పార్క్ విస్తరణ కోసం 'కుడా' కొన్న 29.29 ఎకరాల భూమి పూర్తి స్థాయిలో ధరణిలో నమోదు కాలేదన్న విషయం ఇటీవల 'కుడా' అధికారులు తెలుసుకున్నారు. 2.3 ఎకరాల భూమి మహిళా రైతు పేరు మీద ధరణి వెబ్‌సైట్‌లో నమోదై ఉన్నట్లు గ్రహించారు. రెండ్రోజుల క్రితం సదరు రైతు చేతిలో ఉన్న ధరణి పాస్‌బుక్ రద్దు చేయాలని 'కుడా' అధికారులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై మండల రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఆ భూమి పత్రాలను రైతు నుంచి స్వాధీనపర్చుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం.. గురువారం ఆ పాస్‌బుక్ రద్దు చేసి కుడా (ప్రభుత్వ) భూమిగా ధరణి వెబ్‌సైట్‌లోకి మార్చేలా తహసీల్దార్ కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు తెలిసింది.

అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ



మంత్రి కొండా సురేఖతో అర్చకులు, వేద పండితులు

హన్మకొండ : గ్రామీణ ప్రాంత ధూపదీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని, జీఓ 121 కట్ ఆఫ్ డేట్‌ను తొలగించాలని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ కోరారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, అర్చక బృందం, జేఏసీ ప్రతినిధులు షణ్ముఖశర్మ, లక్ష్మీ ప్రసాద్ శర్మ, ఎల్లంబట్ల రామకృష్ణ శర్మ, మహంకాళి దేవాలయం ఈఓ మనోహర్ రెడ్డి, దేవాలయ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ 577 జీఓ ప్రకారం రాష్ట్రంలో 5625 మందికి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ద్వారా వేతనాలు అందించాల్సి ఉండగా దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాల్లో కేవలం 3 వేల మందికి మాత్రమే వేతనాలు అందిస్తున్నారన్నారు. అదే విధంగా కారుణ్య నియామకాల్లో 5 సంవత్సరాలు అర్చక ఉద్యోగులు ఫైల్ రాష్ట్ర ఫైనాన్స్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని వివరించారు. అర్చక వెల్ఫేర్ ఫండ్‌లో రూ.200 కోట్లు ఉన్నాయని, అర్చక సంక్షేమ నిధికి వివిధ దేవాలయాల నుంచి, బ్యాంకు వడ్డీల ద్వారా రూ.15 కోట్లు వడ్డీ రూపేణ వస్తున్నా... ఇందులో సంవత్సరానికి రూ.కోటి కూడా ఖర్చు చేయడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి కొండా సురేఖ.. అర్చకులు, ఉద్యోగుల మధ్య సమన్వయం లేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. బదిలీల కోసం కమిటీని నియమించి నిర్ణయం తీసుకుంటామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు.

నవాబ్ అలీ నవాజ్ జంగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

● ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: ప్రతీ ఇంజనీర్ నవాబ్ అలీ నవాబ్ జంగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఇంజనీర్ నవాబ్ అలీ నవాబ్ జంగ్ జయంతి నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ నవాబ్ అలీ నవాజ్ జంగ్ విధానాలు అనుసరించాలన్నారు. నిజాంసాగర్ డ్యామ్‌ను ఆసియా ఖండంలోనే భిన్నంగా నిర్మించిన ఘనత నవాబ్ అలీ నవాబ్ జంగ్‌కే దక్కుతుందన్నారు. చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న కాలంలో నవాబ్ అలీ నవాజ్ జంగ్ అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, ఇతర కట్టడాలకు రూపకల్పన చేసి వాటిని విజయవంతంగా నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, కె.కిషన్, రవీంద్రనాథ్, రాజు చౌహాన్, కె.ఎస్.గుట్ట, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, జీఎంలు నాగప్రసాద్, గిరిధర్, మనోహరాస్వామి, వేణుబాబు, మాధవరావు, శ్రీనివాస్, దేవేందర్, సత్యనారాయణ, మల్లికార్జున్, ఎస్ఈ సివిల్ అంకూస్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, డీఈ (ఐటీ) కె.అనిల్ కుమార్, డీఈ(టి) శ్రీధరాచారి పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ ఫీడర్లను గుర్తించాలి

ఓవర్‌లోడ్ ఫీడర్లను గుర్తించి భారం పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. గురువారం టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో నోడల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికాకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. అలాగే ఆయిల్ లీకేజీ కాకుండా చూడాలని, పీక్ లోడ్ సమయంలోనూ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించాలని ఆదేశించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : భార్య ఆత్మహత్యకు కారణమైన కేసులో భర్తకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి హనుమకొండ నవీన్ కుమార్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని సుభాష్ వీధికి చెందిన అగ్నేష్ గోనేష్ బుజాక్షో, గొల్లపల్లి ప్రవీణ్ కుమార్ 2017లో వివాహం చేసుకున్నారు. కుమారుడు జన్మించిన అనంతరం ప్రవీణ్ కుమార్ తన భార్యను మానసికంగా, ఆర్థికంగా వేధింపులకు గురిచేశాడు. ఈ క్రమంలో 2019 డిసెంబర్ 23వ తేదీన ఆమెను చితకబాది ఇంటికి తాళంవేసి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన అగ్నేష్ గోనేష్ బుజాక్షో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి పుచ్చకాయల బేబీరాణి అదే నెల 24వ తేదీన డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై నాగభూషణం కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ అంగోత్ నరేష్ కుమార్ విచారణ చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీడీఓ నవీన్ కుమార్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. వాదనల అనంతరం జిల్లా జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణకాబడిన గొల్లపల్లి ప్రవీణ్ కుమార్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

కేవీలో రీజినల్ స్పోర్ట్స్ మీట్..

● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న విద్యార్థులు

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో గురువారం రెండు రోజుల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజినల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి జ్యోతి ప్రజ్వలన చేసి మీట్‌ను ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ రీజియన్ తొలిసారి రీజినల్ స్పోర్ట్స్ మీట్‌ను కేవీ వరంగల్‌లో నిర్వహిస్తున్నారని, రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థులను నేషనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. టేబుల్ టెన్నిస్ అండర్ -14,17,19 విభాగాల్లో బాలురు, బాలికలు సుమారు 40 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కేవీ పీఈడీ కొర్ర శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహిస్తున్న రీజినల్ స్పోర్ట్స్ మీట్‌కు కిట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి రెఫరీగా వ్యవహరించారు. కాగా, శుక్రవారం విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు నేషనల్ లెవల్‌కు ఎంపిక చేయనున్నారు.

ఉరి వేసుకుని బాలిక మృతి



చిల్పూరు పోలీస్‌స్టేషన్ ఎదుట శైలజ మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

● తండ్రి కొట్టి చంపాడని బంధువుల అనుమానం
● చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన తండ్రి
● అతన్ని అప్పగించాలంటూ మృతదేహంతో బంధువుల ఆందోళన



శైలజ (ఫైల్)

చిల్పూరు: బాలిక ఆత్మహత్య చేసుకోగా.. కన్న తండ్రే కొట్టి చంపాడని బంధువులు అనుమానం వ్యక్తం చేయగా.. భయంతో ఆ వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. అతన్ని తమకు అప్పగించాలంటూ మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద బంధువులు ఆందోళన చేపట్టారు. చిల్పూరులో గురువారం జరిగిన ఘటన వివరాలు మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. చిల్పూరు మండలం పల్లగుట్ట జీపీ పరిధి మారేపల్లిగూడానికి చెందిన సందెళ దివ్యను ఉనికిచర్లకు చెందిన శివ వివాహం చేసుకున్నాడు. వీరికి కూతురు శైలజ(16) ఉంది. కొన్నేళ్ల క్రితం దివ్య మృతిచెందడంతో శివ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తికి చెందిన రేణుకను రెండవ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో అద్దె ఇంట్లో కాపురం పెట్టి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రేణుకకు ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. మొదటి భార్య కూతురు శైలజను చిన్నప్పటినుంచే పల్లగుట్టలోని బంధువుల ఇంట్లో ఉంచగా 1 నుంచి 7వ తరగతి వరకు స్థానిక పాఠశాలలో, 8వ తరగతి నమిలిగొండ కేజీబీవీలో, 9, 10 తరగతులు ప్రస్తుతం జఫర్‌గఢ్ కేజీబీవీలో చదువుతోంది. 15 రోజుల క్రితం శైలజకు జ్వరం రావడంతో తండ్రి శివ తీసుకుని పల్లగుట్ట బంధువుల ఇంట్లోఉంచి హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ శైలజ విషయంలో రెండవ భార్యతో 10 రోజుల క్రితం గొడవ జరగడంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. మంగళవారం శివ పల్లగుట్టకు వచ్చి కూతుర్ని కూకట్‌పల్లికి తీసుకెళ్లాడు. బుధవారం ఉదయం శివ కారు డ్రైవింగ్ డ్యూటీకి వెళ్లగా.. ఆ సమయంలో శైలజ 'నాన్న నాపై అనుమానం పెట్టుకున్నావు.. నేను భరించలేను.. నేనుకూడా అమ్మదగ్గరికి వెళ్తున్నాను' అంటూ లెటర్ రాసి పెట్టి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన శివ తలుపు కొట్టగా తీయకపోవడంతో అనుమానంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే శైలజ మృతిచెందింది. పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. గురువారం మారేపల్లిగూడెంలోని బంధువులకు విషయం తెలపగా దహన సంస్కారాల ఏర్పాట్లు చేసి ఉంచారు. సాయంత్రం మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లో మరేపల్లిగూడానికి తీసుకురాగానే 'శైలజను నీవే ఉరివేసి చంపావంటూ' అంబులెన్స్‌లో ఉన్న శివను కొట్టే ప్రయత్నం చేయగా తప్పించుకుని అంబులెన్స్ తోపాటు చిల్పూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. దీంతో బంధువులు మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. రాత్రి 9 గంటల వరకు కూడా ఆందోళన కొనసాగుతోంది.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్



రాకేశ్ అరెస్ట్ చూపుతున్న కాజీపేట ఏసీపీ తిరుమల్

మడికొండ: తాళ వేసి ఉన్న ఇళ్లల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన రెడ్లం రాకేశ్.. ఇటీవల మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెస్ట్ సిటీ రోడ్డు నంబర్-5బీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి 6 తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. అలాగే, రోడ్డు నంబర్-4లో తాళం పగులగొట్టి మరో ఇంట్లో చోరీకి యత్నించాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్సై రాజబాబు, హెడ్ కానిస్టేబుల్ రాంచందర్, రామనాథం, నాగేశ్వర్‌రావుతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం వెస్ట్ సిటీలో మరోసారి చోరీ చేయడానికి బైక్‌పై సంచరిస్తుండగా పోలీసులకు అనుమానం వచ్చింది. దీంతో విచారించగా రాకేశ్ తన నేరం ఒప్పుకున్నాడు. జల్సాలకు అలవాటు పడి తాను స్కావెంజర్ పని చేయడం వల్ల వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడుతున్నట్లు తెలిపాడు. దీంతో నిందితుడి వద్ద నుంచి 6 తులాల బంగారం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు కాజీపేట ఏసీపీ తిరుమల్ తెలిపారు. కార్యక్రమంలో మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఎస్సైలు రాజబాబు, దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌సీ వర్తింపజేయాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఉద్యోగ సంఘాల వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2013లో నియమితులైన 80 మంది ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయడం లేదని, ఇప్పటికైనా వర్తింపజేయాలని కోరుతూ గురువారం కేయూ ఎన్‌జీఓ, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌ల బాధ్యులు హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్‌టీసీ, బీసీ వెల్ఫేర్ శాఖమంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్లానింగ్ కమిషన్ బోర్డు, త్రిసభ్య కమిటీ చైర్మన్ జి. చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే, కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, ప్రొఫెసర్ కోదండరాంకు వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు లకావత్ యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి మాట్లాడుతూ 2013లో రెగ్యులర్ ఉద్యోగులుగా నియమితులైన 80మందికి అధికారులు 2020లో చెల్లించాల్సిన పీఆర్సీ అమలు చేయడం లేదన్నారు. దీంతో పీఆర్‌సీ ద్వారా వచ్చే లబ్ధి పొందకపోవడంలో ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. దీనిపై స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయా సంఘాల బాధ్యులు అబ్దుల్ షకూర్, పి.కోర్నెల్, ఎ. సతీష్‌బాబు, టి. ప్రభాకర్, పి. అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల రెండో వారంలో హైదరాబాద్‌లో జరగనున్న టూడే లీగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీ తోట రాము, తోట కుమార్, మట్టెడ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో ఉత్తమ బౌలింగ్, బ్యాటింగ్ శైలితో పాటు ఫీల్డింగ్‌లో ప్రతిభ కనబరిచిన 15 మందితో జట్టు, స్టాండ్‌బైగా 13 మందిని ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా జట్టు కోచ్‌గా గోవింద్‌సింగ్, మేనేజర్‌గా ప్రణయ్‌కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజా, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్ పాల్గొన్నారు.